సాక్షి
విశాఖపట్నం
సోమవారం : 5 : జూన్ : 2023



నేవీ 'పర్యావరణ' ర్యాలీ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మిషన్ లైఫ్ పేరుతో నేవీ సిబ్బంది సైకిల్ ర్యాలీ చేపట్టారు. 8లో



తుదిదశకు బదిలీల ప్రక్రియ..!

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నేటి నుంచి వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రారంభం కానుంది. 8లో



రైతు సంక్షేమమే ధ్యేయం

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. 8లో

తలచుకుంటే వణుకొస్తోంది



- ఏం జరిగిందో తెలుసుకునేందుకు గంట సమయం పట్టింది
- మొబైల్ ఫ్లాష్ లైట్ వేస్తే మాతో ప్రయాణించినవారు విగతజీవులుగా కనిపించారు
- దేవుడు పునర్జన్మ ఇవ్వడం వల్లే.. ఇక్కడికి రాగలిగాం..
- బాధలో ఉన్నప్పుడు భరోసా ఇస్తూ ప్రభుత్వం చేసిన సాయం మరువలేనిది
- విశాఖ చేరుకున్న రైలు ప్రమాద బాధిత ప్రయాణికులు

మాటలకందని విషాదం.. మనసుల్ని చిదిమేసింది.. ప్రమాదం జరిగి.. 60 గంటలు గడుస్తున్నా.. ఎవరు ఎక్కడున్నారో..? ఎలా ఉన్నారో తెలియని హృదయ విదారక దృశ్యాలే కనిపిస్తున్నాయి. భయానక ఉత్పాతం నుంచి అదృష్టవశాత్తూ బయటపడి.. సొంతూళ్లకు తిరిగివచ్చిన వారంతా.. తమకు పునర్జన్మ లభించిందని చెబుతున్నారు. ఒడిశాలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో చిక్కుకొని ఎలాగోలా బయటపడి వచ్చేసినా.. ఇంకా ఆ రాత్రి తమ జీవితాల్లో కాళరాత్రిలా కళ్లముందే కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరుగాని ఊరులో ప్రమాద పుటంచుల్లో హాహాకారాల మధ్య జీవనం గడుపుతూ ప్రతి నిమిషం భయం వెంటాడుతున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన సాయం మరువలేనిదని చెబుతున్నారు. విశాఖ చేరుకున్న పలువురు బాధితుల కన్నీటి కథలివీ..

– సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట

బతికున్నానంటే నమ్మలేకపోతున్నా..



ఒక్కసారిగా కుదుపు వచ్చి పడిపోయాను. నా మీద బ్యాగులు, మనుషులు పడిపోయారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాను. కాసేపటి తర్వాత కళ్లు తెరిస్తే.. కొందరు నన్ను మోసుకొంటూ అంబులెన్స్ దగ్గరికి తీసుకొచ్చారు. అక్కడ డాక్టర్లు మొత్తం చెక్ చేశారు. అప్పటి వరకు ఏం జరిగిందో.. ఎందుకు పడిపోయానో తెలీదు. పక్కనున్న వాళ్లని అడిగితే.. రైళ్లు గుద్దుకున్నాయని చెప్పారు. కళ్లముందే శవాల గుట్టలు కనిపించాయి. కొందరు తమ వాళ్లు కనిపించక.. రక్తాలతో అటు ఇటు పరుగెడుతున్నారు. నాకు నా కుటుంబం గుర్తొచ్చింది. భయంతో వణికిపోయాను. నా భర్తకి అప్పటికే దెబ్బలు తగిలున్నాయి. ఆయన నా దగ్గరికి వచ్చారు. ఆయన్ని చూడగానే ఊపిరి వచ్చింది. ప్రభుత్వ సహకారంతో ఇక్కడి వచ్చాం. చాలా బాగా తీసుకొచ్చారు. దారిలో భోజనాలు, పళ్ల రసాలు అందిస్తూ.. జాగ్రత్తగా చూసుకుని వైద్యం అందిస్తున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నాం. ఇంత ఘోరం జరిగిందని తలచుకుంటేనే భయం, ఏడుపు వచ్చేస్తున్నాయి. బతికున్నానంటే నమ్మలేకపోతున్నాను. మళ్లీ నా పిల్లల్ని, మన వళ్లని చూస్తామని కలలో కూడా అనుకోలేదు.

– భారతి, బుచ్చిరాజుపాలెం, విశాఖపట్నం

ఇలాంటి ఘోరాన్ని ఎవరూ చూడకూడదు



ఖరగ్‌పూర్ పెళ్లికి వెళ్లి.. కోరమండల్‌లో తిరిగి వస్తున్నాం. ఎస్–3 బోగీలో ఉన్నాం. సాయంత్రం చిన్నగా కునుకు తీస్తున్నాను. ఇంతలో ఒక్కసారిగా బండి జర్క్ అయినట్లు అయింది. ఫాస్ట్‌గా ట్రైన్ వెళ్తోంది కదా.. అందుకే అనుకున్నాను. ఒక్క క్షణంలో కింద పడిపోయాను. నాపైన లగేజీలు, పై బెర్త్‌లో ఉన్న ఇద్దరు పడిపోయారు. బోగీలో జనమంతా ముద్దగా పడిపోయాం. పైనున్న ఒక్కొక్కరూ లేచి ఒకరికొకరం సాయం చేసుకుని బయటపడ్డాం. అప్పటికే.. అందరికీ దెబ్బలు తగిలాయి. ఈ క్రమంలో స్పృహ కోల్పోయాను. కాసేపటికి ఎవరో నలుగురు ముఖంపై నీళ్లు చల్లితే దుకాణం వద్ద ఉన్నాను. వాళ్లు నా ప్రాణాలు కాపాడారు. ఏం జరిగిందని అడిగితే.. ఘోరం గురించి చెప్పారు. తల్లడిల్లిపోయాను. నా భార్య కోసం వెతికితే.. ఆమె క్షేమంగా ఇంకో చోట ఉందని చెప్పారు. వెంటనే నన్ను అక్కడికి తీసుకెళ్లమని చెప్పాను. దారిలో వెళ్తుంటే.. శవాలను, గాయపడిన వారిని మోసుకెళ్తున్నారు. అది చూశాక దేవుడా.. ఇలాంటి ఘోరాన్ని ఇంకెవరూ చూడకుండా కాపాడు స్వామీ అని మొక్కుకున్నాను. రాష్ట్ర ప్రభుత్వం, బంధువుల సహకారంతో విశాఖ వచ్చేశాను. ఇక్కడ మంచి వైద్యం అందిస్తున్నారు.

– మాధవరావు, బుచ్చిరాజుపాలెం

షాక్ నుంచి తేరుకోవడానికి చాలా సమయం పట్టింది



షాలిమార్‌లో రైలు ఎక్కాను. వైజాగ్‌లో దిగాల్సి ఉంది. నేను దివ్యాంగుల కోచ్‌లో ఉన్నాను. భారీ శబ్దం వినిపించింది. మా బోగీ.. గూడ్స్ రైలుకు ఇటువైపున పడిపోయింది. అటు పడి ఉంటే.. ఇప్పుడు మాట్లాడేందుకు ఉండేవాడిని కాదేమో. మా బోగీలో నా పక్కన కూర్చున్న వారిలో ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. అది చూసి నాకు భయం మొదలైంది. నరకం కనిపించింది. అతి కష్టమ్మీద.. బోగీ నుంచి బయటకు వచ్చాను. ఏమి కనిపించ లేదు. చాలా మంది ఏడుపులు, కేకలు వినిపిస్తున్నాయి. నా మొబైల్‌లో లైట్ వేసి చూశాను. చాలా మంది రక్తంతో అటు ఇటు తిరుగుతున్నారు. బోగీలో అటు ఇటు.. ఎగిరి పడటం వల్ల.. ఒళ్లంతా నొప్పులైపోయాయి. నడవలేని పరిస్థితిలో ఉన్నాను. మెల్లగా ట్రాక్ దాటి.. ఒక మూల కూర్చున్నాను. ఇంతలో కొందరు ఊరి వాళ్లు వచ్చి.. నన్ను అంబులెన్స్ దగ్గరకు తీసుకెళ్లారు. తర్వాత రోజు ఉదయం సీఎం జగన్ మన వైజాగ్ నుంచి మంత్రుల్ని పంపించారని తెలిసింది. తెలుగు వాళ్లందర్ని అక్కడికి తీసుకెళ్లి.. స్పెషల్ ట్రైన్‌లో వైజాగ్ పంపించారు. ఇక్కడ ట్రీట్‌మెంట్ బాగా ఉంది. ప్రతి గంటకు డాక్టర్లు వచ్చి.. ఎలా ఉందని అడుగుతున్నారు. నొప్పులు ఇంకా తగ్గలేదు.. రికవరీ అయ్యేందుకు కొంత టైమ్ పడుతుందని డాక్టర్లు చెప్పారు. నా జీవితాంతం ఈ ప్రమాదం నా కళ్లముందే కనిపిస్తుంటుందేమో. వెంటనే ఆదుకొని వైజాగ్ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– శంకర్‌రావు, పాతర్లపల్లి గ్రామం, రణస్థలం, శ్రీకాకుళం

పడిపోయిన బోగీలోనే 40 నిమిషాలు



నేను, నా భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రైలులో ప్రయాణిస్తున్నాం. సాయంత్రం టీ తాగి పిల్లలతో కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇంతలో భారీ శబ్దం వినిపించింది. ఒక్కసారిగా మా బోగీ కుదుపునకు గురైంది. బాంబు పేలిందేమోనని భయంతో వణికిపోయాం. బోగీ పక్కకు ఒరిగిపోయింది. అసలేం జరిగిందో మాకు అర్థం కాలేదు. పిల్లలు, నేను, నా భార్య.. తోటి ప్రయాణికులంతా చెల్లాచెదురైపోయాం. 40 నిమిషాలకు పైగా బోగీలోనే ఉండిపోయాం. మా పిల్లలు కాసేపు కనిపించలేదు. చనిపోయారేమోనన్న ఆలోచనతో కాళ్లు, చేతులూ వణికిపోయాయి. నా భార్య నొప్పితో విలవిల్లాడుతోంది. పిల్లల కోసం అరిచాను. మా సీట్లకు రెండు సీట్ల దూరంలో వారు జారిపోయి ఉన్నారు. వారు లగేజీలపై పడటంతో ఎలాంటి గాయాలు కాలేదు. కొందరు ప్రయాణికులు అద్దాలు పగలగొట్టారు. ఈలోగా కొందరు గ్రామస్తులు వచ్చి సాయం చేశారు. ముందుగా పిల్లల్ని బయటకి పంపించాం.. నా భార్యని పైకి లాగారు. తర్వాత నేను బయటికి వచ్చాను. సాయం చేసేందుకు వచ్చిన వాళ్లు.. ఏం జరిగిందో చెప్పారు. ఈ ప్రమాదం నదిపైన జరిగి ఉంటే.. ఈరోజు ఇలా మాట్లాడే వాళ్లం కాదేమో. కొంచెం ముందుకెళ్లి చూస్తే చాలామంది చనిపోయి ఉన్నారు. వాళ్లని చూసి నాకు ఏడుపు ఆగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కొందరు అధికారుల్ని, మంత్రుల్ని పంపించిందని అక్కడ చెప్పడంతో వాళ్ల వద్దకు వెళ్లాను. ట్రైన్‌లో వైజాగ్ వచ్చేశాం. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో నాకు, నా భార్యకు మెరుగైన వైద్యం అందుతోంది. రూపాయి ఖర్చు లేకుండా సీఎం వైఎస్ జగన్ మాకు వైద్యం చేయిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి మన రాష్ట్రానికి చెందిన వారిని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసిన ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– లోకేష్, ప్రమాద బాధితుడు

కాళీమాతే కాపాడింది..!

- తీర్థయాత్రకెళ్లి వస్తుండగా ప్రమాదం
- మాలో ఏడుగురూ బతికి బయటపడ్డాం
- రైలు ప్రమాద బాధితుడు సత్యం



సాక్షి, విశాఖపట్నం: నగరంలోని జాలరిపేట, వాడపేటల నుంచి ఏడుగురు గత నెల 27న తీర్థయాత్రకు బయల్దేరారు. వీరు తొలుత కాశీ వెళ్లి విశ్వేశ్వరుని, అనంతరం కోల్‌కతాలోని కాళీ మాతను దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ఈనెల రెండో తేదీన కోల్‌కతాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. వీరిలో ఎస్–1లో ఇద్దరు, ఎస్–4 బోగీలో ఐదుగురు ఉన్నారు. వీరెక్కిన రైలు ఒడిశాలోని బహనగ వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగానూ, ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరు ఆదివారం ఉదయం ఓ వాహనంలో విశాఖ చేరుకున్నారు. ప్రమాద బాధితుల్లో ఒకరైన జాలరిపేటకు చెందిన ఎం.సత్యంకు బాధితుల తరఫున ప్రభుత్వం రవాణా ఖర్చుల కింద రూ.30 వేల చెక్కును మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ సందర్భంగా రైలు దుర్ఘటనపై సత్యం 'సాక్షి'తో మాట్లాడారు. 'ప్రమాదం జరిగే సమయానికి మేం ఎంతో సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇంతలో పెద్ద శబ్దంతో భారీ కుదుపు. క్షణాల్లోనే బోగీలు తిరగబడ్డాయి. అంతా అరుపులు.. కేకలు. ఏం జరిగిందో తెలిసే లోగానే బోగీ అంతా రక్తసిక్తం. చాలామంది చనిపోయారు. మాపైనా చాలా మంది పడిపోయారు. నాతో ఉన్న రాజు, రమణలకు బాగా దెబ్బలు తగిలాయి. నాకు, నా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. మేం బతుకుతామన్న నమ్మకం లేదు. మాతోటి ప్రయాణికుడు సీహెచ్ రాజు కారుతున్న రక్తాన్ని లెక్క చేయకుండా మమ్మల్ని బతికించాడు. లేదంటే మేమంతా చనిపోయేవాళ్లం. ఆ కలకత్తా కాళీమాతే మమ్మల్ని బతికించింది.' అని కన్నీటి పర్యంతమవుతూ సత్యం చెప్పాడు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



గాయత్రి విద్యా పరిషత్ విద్యా కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని రుషికొండ, ఎన్‌ఏడీ, చినముషిడవాడ, పెదగంట్యాడ, శీలానగర్, ఆనందపురంలలో మొత్తం ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో తనిఖీ చేసిన తరువాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ముందు జాగ్రత్తల్లో భాగంగా అన్ని కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా మూడో విడత చందనం సమర్పణ



జ్యేష్ఠాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం మూడో విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. విశేష పూజలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలో వేంజేపచేసి జ్యేష్ఠాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. గంగధార జలాలు, పంచామృతాలతో పంచకలశ స్నపనాన్ని నిర్వహించారు.

అమిత్‌షా సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సోమువీర్రాజు

మద్రిపాలెం: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విశాఖ నగర పర్యటన ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు ఆదివారం పరిశీలించారు. ఈనెల 8న భారీ బహిరంగసభ జరగనున్న మద్రిపాలెం జాతీయ రహదారి సమీపంలో ఉన్న శారదా బేకరి గ్రౌండ్స్‌ను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కాశీ విశ్వనాథరాజు, ఉప్పిల్ వంశీయాదవ్ ఉన్నారు.

తానా మహాసభలకు విశాఖ రచయితకు ఆహ్వానం



సాక్షి, విశాఖపట్నం : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) మహా సభలు–2023కు విశాఖకు చెందిన అంతర్జాతీయ రచయిత శ్రీధర్ బెవరకు ఆహ్వానం అందింది. మహా సభల్లో భాగంగా జరిగే నాయకత్వం, యువత సాధికారత అనే అంశంపై నిర్వహించే సెమినార్‌లో రచయిత, గోవా రాష్ట్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ అడ్వైజర్ శ్రీధర్ బెవర ప్రసంగించనున్నారు. జూలై 7 నుంచి 9వ తేదీ వరకూ జరిగే ఈ సమావేశాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు పలువురు మంత్రులు, రచయితలతో కలిసి చర్చల్లో మాట్లాడనున్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' పేరిట స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు.

బైక్ సర్వీస్ సెంటర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 15 ఎలక్ట్రికల్ బైక్‌ల దగ్ధం
- రూ.50 లక్షల వరకు ఆస్తినష్టం



దగ్ధమైన ఎలక్ట్రిక్ బైక్‌లు



సర్వీస్ సెంటర్ వద్దకు చేరుకున్న స్థానికులు

సీతమ్మధార: దొండపర్తి వెంకటరాజునగర్‌లోని ఏథర్ ఎలక్ట్రికల్ బైక్ సర్వీస్ సెంటర్‌లో ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. 15 ఎలక్ట్రిక్ బైక్‌లు దగ్ధమవగా.. సుమారు రూ.50 లక్షల వరకు నష్టం జరిగినట్లు అంచనా. వివరాల్లోకి వెళితే.. సర్వీస్ సెంటర్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో స్పేర్‌పార్టులు సామగ్రి ఉన్న గదిలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో మంటలు వ్యాపించాయి. రెండో ఫ్లోర్‌లో ఉన్న సుమారు 15 ఎలక్ట్రిక్ బైక్‌లు కాలిపోయాయి. అప్పటికే మంటలు భారీగా రావడంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ఆదివారం సర్వీస్ సెంటర్ సెలవు కావడంతో ప్రాణనష్టం జరగలేదు. స్థానికుల సమాచారం మేరకు ఏడీఎఫ్ఓ ఎం.గోపికృష్ణ ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఫోర్తుటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల, మోహన్‌రావుతో పాటు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఎఫ్‌వో ఎం.గోపికృష్ణ మాట్లాడుతూ రాత్రి 7.30 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని, వెంటనే మద్రిపాలెంలో ఉన్న వాహనంతో పాటు మరో వాహనంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు అదుపులోకి తీసుకువచ్చామన్నారు. ఆదివారం కావడంతో ఎవరూ లేకపోవడంతో.. సోమవారం సర్వీస్ సెంటర్ అధినేతతో మాట్లాడి అసలు ఏమి జరిగిందన్న కోణంలో పరిశీలిస్తామన్నారు. సుమారు 15 ఎలక్ట్రిక్ వాహనాలు దగ్ధమైనట్లు తెలుస్తుందన్నారు. నివాసితులు ఉన్న ప్రాంతాల్లో పలు కంపెనీలు గొడౌన్‌లు, సర్వీస్ సెంటర్లు నిర్వహించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు?

- శుభకార్యానికి వెళ్లి వస్తూ.. అనంతలోకాలకు..
- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం
- కుమార్తె పరిస్థితి విషమం





ఆస్పత్రిలో మృతి చెందిన పావని, సంఘటన స్థలంలో పెద్దయ్య మృతదేహం

కొమ్మాది/ఆరిలోవ: భార్యాభర్తలు.. కుమార్తెతో కలిసి బంధువుల శుభకార్యానికి వెళ్లారు. అక్కడ రాత్రంతా సంతోషంగా గడిపారు. తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. గాయపడిన కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. సాగర్‌నగర్ దరి బీచ్‌రోడ్డులో బే పార్కు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. డివైడర్‌ను ఢీకొట్టడమే ఈ ప్రమాదానికి కారణమని ఆరిలోవ పోలీసులు భావిస్తున్నారు. వారు తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా భోగాపురం మండలం కంచేరు కొండరాజు పాలేనికి చెందిన మైలపల్లి పెద్దయ్య (30), అతని భార్య పావని(25), మూడేళ్ల కుమార్తె యక్షిత నగరంలోని జాలరిపేటలో నివాసముంటున్నారు. పెద్దయ్య కూలి పనులు చేస్తుంటాడు. సొంత ఊరులో బంధువుల వివాహం కోసం వారు ముగ్గురూ కలసి బైక్‌పై శనివారం బయలుదేరి వెళ్లారు. రాత్రంతా పెళ్లిలో అందరితో సరదాగా గడిపి.. తిరిగి ఆదివారం వేకువజామున అదే బైక్‌పై నగరానికి వస్తున్నారు. జాతీయ రహదారి వద్ద ఎండాడ నుంచి రుషికొండ వెళ్లి.. అక్కడ నుంచి బీచ్‌రోడ్డులో జాలరిపేట వస్తుండగా బైక్ అదుపు తప్పింది. బే పార్కు, రాడిసన్ బ్లూ హోటల్ మధ్యలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో పెద్దయ్య తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. తీవ్ర గాయాలు పాలైన అతని భార్య పావని, కుమార్తె యక్షితను స్థానికులు గీతం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పావని మృతి చెందింది. యక్షితను కేజీహెచ్‌కు తరలించారు. యక్షిత ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతోంది. భార్యాభర్తల మృతదేహాలను పోలీసులు కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మామ ఎరుపల్లి సన్యాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిద్ర మత్తులో బైక్ సరిగా నడపలేక డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

'గడప గడప'లో ప్రజలతో మమేకం

- క్రమం తప్పకుండా అన్ని గ్రామాలకు వెళ్లండి
- పూర్తయిన గ్రామాలకు ప్రభుత్వ నిధులు మంజూరు
- వాటితో సమస్యల పరిష్కారానికి కృషి చేయండి
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమీక్ష



ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమీక్షిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ విశాఖ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి కొనియాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రతీ గడపకూ వెళ్లి ఒక్కో కుటుంబానికి సంక్షేమం పేరిట ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలని సూచించారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో గ్రామాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేయాలని సూచించారు. 'గడప గడపకు' కార్యక్రమం పూర్తయిన పంచాయతీలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.20 లక్షలతో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. మూడు జిల్లాల్లో గల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను నియోజకవర్గాల వారీగా ఇప్పటి వరకూ పూర్తిచేసిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వివరాలు వైవీ సుబ్బారెడ్డి అడిగి తెలుసుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి పనులను మన ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో పోల్చితే మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30 రెట్లు అధికంగా చేశామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి ప్రతి ఒక్కరూ తీసుకెళ్లాలని సూచించారు. అర్హులందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష న్నారు. ఎక్కడైనా చిన్నపాటి టెక్నికల్ సమస్యల కారణంగా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే... వారికి తక్షణమే అందేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా వాస్తవాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనువాసరావు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, సంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, నాయకులు ఈర్లె అనురాధ, అక్కరమాని వెంకటరావు, వైఎస్సార్‌సీపీ రీజినల్ యువజన విభాగం అధ్యక్షుడు ముత్తంశెట్టి వెంకట శివసాయి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ బలోపేతానికి చర్యలు

పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

అల్లిపురం: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయనున్నట్లు పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎం.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఉత్తరాంధ్ర లీగల్ సెల్ కన్వీనర్ జీఎం రెడ్డి అధ్యక్షతన ఆదివారం వాల్తేరు క్లబ్‌లో లీగల్ సెల్ ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సెల్ విస్తరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన కమిటీల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పదవులు వచ్చిన వారు తప్పనిసరిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఇప్పటికే జీపీలు, పీపీలు పోస్టుల్లో అన్ని సామాజిక వర్గాల వారికి ప్రాధాన్యం కల్పించినట్లు చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యం ఉంటుందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లీగల్ సెల్ ప్రధాన భూమిక వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చేపడుతున్న రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలని సూచించారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. త్వరలోనే లీగల్ సెల్ జిల్లా కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, బాజీ నాయుడు, సన్నీ యాదవ్, గాలి రామరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నారు. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తదితర తహసీల్దార్ల కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 0891–2562977 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

తుదిదశకు బదిలీల ప్రక్రియ..!

- ఫైనల్ సీనియారిటీ జాబితాలు విడుదల
- అన్ని కేడర్ల ఖాళీల ప్రదర్శన, నేటి నుంచి వెబ్ ఆప్షన్లు
- ఆన్‌లైన్ బదిలీల్లోనూ అయ్యవార్లు అడ్డదారులు
- స్టేషన్ సీనియారిటీ తప్పిదాలపై ఫిర్యాదుల వెల్లువ
- దరఖాస్తుల పరిశీలనలో విద్యాశాఖాధికారుల అలసత్వం

విశాఖ విద్య: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని ఓ స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) 9.0301 పాయింట్లకు గాను 17.4960 పాయింట్లు వేసుకోవటంతో సీనియారిటీ జాబితాలో ముందుకెళ్లారు. స్టేషన్ సీనియారిటీ పాయింట్లు తప్పిదాలను గుర్తించిన కొంతమంది ఉపాధ్యాయులు తమకు అన్యాయం జరుగుతుందంటూ డీఈవో కార్యాలయ అధికారులుకు ఫిర్యాదు చేశారు. రేషనలైజేషన్‌కు గురైన వారికి మేలు చేయాలని, స్టేషన్ సీనియారిటీ పాయింట్లు నమోదులో ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. దీన్ని సాకుగా తీసుకున్న కొంతమంది అయ్యవార్లు బదిలీల్లో మంచి ప్రదేశాల దక్కించుకోవాలనే దుర్బిద్ధితో అడ్డదారులు తొక్కారు. ఫైనల్ సీనియారిటీ జాబితాలో ఇలాంటి వారు చాలా మందే ఉన్నారని తప్పిదాలను గుర్తించిన ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేసేందుకు విశాఖలోని డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

పైరవీలకు చెక్ పెట్టాలనే ఆన్‌లైన్ బదిలీలు

మాన్యువల్ బదిలీల కోసమని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పట్టుబట్టినా, పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ బదిలీలకే మొగ్గు చూపింది. దరఖాస్తుల మొదలు ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రదర్శన వరకు ఎంఈవో, డెప్యూటీ డీఈవో, డీఈవో స్థాయిలో సమగ్ర పరిశీలన చేసేలా ఉన్నతాధికారులు స్పష్టమైన విధి విధానాలు రూపొందించారు. కానీ ప్రభుత్వ విధానాలపై పనిగట్టుకొని వ్యతిరేకించే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుల కనుసన్నుల్లోనే డీఈవో కార్యాలయ అధికారులు అంటగాకుతూ జాబితాలపై పరిశీలన చేస్తుండటంతో తమకు అన్యాయం జరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు.


ఫిర్యాదులు ఇస్తున్న ఉపాధ్యాయులు

లోపం ఎక్కడుంది

ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రయారిటీ పాయింట్లు కీలకంగా ఉంటాయి. స్టేషన్ సీనియారిటీ పాయింట్లు నమోదులో తప్పిదాలకు ప్పాలడితే, అలాంటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని ముందుగానే విద్యాశాఖాధికారులు హెచ్చరించారు. కానీ కొంతమంది వీటిని పెడచెవిన పెట్టినట్లు ప్రస్తుత పరిణామాల భట్టి తెలుస్తోంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలో అన్ని కేడర్లుకు చెందిన ఉపాధ్యాయులు 78 మంది బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తక్కువగా దరఖాస్తులు వచ్చిన ఇలాంటి చోట కూడా ఫైనల్ సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలు బయటపడుతుండటంతో లోపం ఎక్కడ జరిగిందనేది ఉన్నతాధికారుల పరిశీలన చేయాల్సి ఉంది.

ఖాళీల జాబితా విడుదల

ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరుగుతుండగా 6,088 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ 1,997 మంది ఉన్నారు. తప్పనిసరి బదిలీల్లో అత్యధికంగా 1,394 మంది సెకండరీ గ్రేట్ టీచర్లు కాగా గ్రేడ్ –2 హెచ్ఎం 105, మిగతా 498 స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు చెందిన వారు ఉన్నారు. సీనియారిటీ జాబితాలు ఇప్పటికే విడుదలయ్యాయి. కాగా ఉమ్మడి విశాఖ పట్నం జిల్లాలోని అన్ని కేడర్ల ఖాళీల జాబితాను ఆదివారం ప్రకటించారు.

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సోమ మంగళవారాల్లో గ్రేడ్–2 హెచ్ఎంలు వెబ్ఆప్షన్లు ఎంచుకోవచ్చు. స్కూల్ అసిస్టెంట్లు 5,6,7 తేదీల్లో, ఎస్జీటీలు 5,6,7,8 తేదీల్లో వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. అన్ని కేడర్లుకు చెందిన ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు ఈ నెల 9న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి.

నేవీ 'పర్యావరణ' ర్యాలీ

బీచ్‌రోడ్డు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) పేరుతో తూర్పు నావికాదళం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఆదివారం 500 మంది నేవీ ఉద్యోగులు సైకిల్ ర్యాలీ చేస్తూ.. నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2023 జులై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించనున్నారని పేర్కొన్నారు. జూన్ 30 చివరి తేదీగా https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

ముగిసిన ఆర్గానిక్ మేళా


మేళాలో విక్రయాలు చేస్తున్న సందర్శకులు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): గాదిరాజు ప్యాలెస్ వేదికగా రాష్ట్ర రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళా ఆదివారంతో ముగిసింది. 60 స్టాళ్ల ద్వారా ఇక్కడ గ్రామీణ సేంద్రియ ఉత్పత్తులను రైతులు ప్రదర్శించడంతో పాటు విక్రయాలు జరిపారు. దీంతో నగర సందర్శకులు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి విక్రయాలు జరిపారు. మేళాలో సేంద్రియ పంటల ఉత్పత్తులు, వంట పదార్థాలు, నూనెలు, ఔషధాలు, విత్తనాలు, గృహోపకరణాలు వంటి ఎన్నో సహజసిద్ధ ఉత్పత్తులు సందర్శకులను ఆకర్షించాయి. వీటిని కొనుగోలు చేసేందుకు నగరవాసులు భారీగా మేళాకు తరలివచ్చారు. కొన్ని సంస్థలు రాయితీపై మిల్లెట్స్, డ్రైఫ్రూట్స్ విక్రయాలు జరిపాయి. మూడు రోజుల మేళాలో విక్రయాలు ఆశాజనకంగా సాగినట్లు రాష్ట్ర రైతు సాధికారత సంస్థ మార్కెటింగ్ విభాగం స్టేట్ లీడ్ బి.ప్రభాకర్ వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రజారోగ్యంతో పాటు భూసారం పెంచేందుకు సేంద్రియ పంటలను మరింత ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించే దిశగా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు.

రైతు సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- యంత్ర సేవా పథకంతో రైతులకు లబ్ధి
- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి
- గ్రేహౌండ్స్ భూ బాధితులకు పరిహార చెక్కుల అందజేత


భూ బాధితులకు పరిహార చెక్కులు అందజేస్తున్న వై.వి సుబ్బారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. చందక పంచాయతీ జగన్నాథపురంలో ఆదివారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద గ్రూపులకు ట్రాక్టర్లు, గ్రేహౌండ్స్ నిర్మాణానికి భూములు అందించిన రైతులకు పరిహార చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వై.వి సుబ్బారెడ్డి మాట్లాడుతూ యాంత్రీకరణతో సాగు గిట్టుబాటు అవుతుందని, ఈ ఉద్దేశంతోనే యంత్ర సేవా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా రాయితీతో ట్రాక్టర్లతో పాటు ఇతర పనిముట్లను ప్రభుత్వం అందిస్తోందని, రైతులు ఎప్పుడు కావాలంటే అప్పుడు వీటిని వినియోగించుకోవచ్చని సూచించారు. ముఖ్యమంత్రి మాటిస్తే చేసి చూపిస్తారని.. ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్చుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. పందలపాకలో ఐటీబీపీకి భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం, పాండ్రింకి బ్రిడ్జి, తగరపువలస బస్టాండ్, కణమాంలో ఆటో పార్క్, బోని, ముచ్చర్ల, శిర్లపాలెం గ్రామాల్లో మాన్యాస్ భూములు వంటి అంశాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తన దృష్టికి తీసుకొచ్చారని.. సీఎం జగన్‌తో చర్చించి వీటిని పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ గ్రేహౌండ్స్ కోసం భూములిచ్చిన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వల్ప కాలంలోనే పరిహారం అందించే ఏర్పాట్లు చేశారన్నారు. సచివాలయాలు ఏర్పాటు వల్ల అందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని వివరించారు. జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ కణమాంలో ఆటో పార్క్ ఏర్పాటు వలన మండలంలోని వేలాది మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు. గ్రేహౌండ్స్ కోసం సేకరించిన భూముల్లో ఇంకా ఎవరైనా అర్హత గల రైతులు ఉంటే పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గ్రేహౌండ్స్‌కు సంబంధించి 133 మంది రైతులకు పరిహారం కింద రూ.15.38 కోట్ల చెక్కులు, జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించి 15 కస్టమర్ హైరింగ్ సెంటర్లకు రూ.36 లక్షల రాయితీతో 15 ట్రాక్టర్లను అందజేశారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఆర్డీవో భాస్కర్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి, వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ ప్రసాద్, తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, ఆనందపురం, భీమిలి జెడ్పీటీసీ సభ్యులు కోరాడ వెంకటరావు, గాడు వెంకటప్పడు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ బంక శ్రీను, విజినిగిరి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆపద సమయంలో విశేష సేవలు


బాధితురాలు పూజను విశాఖ తీసుకొస్తున్న 108 సిబ్బంది

మహారాణిపేట: రైలు ప్రమాద బాధితులకు సేవలందించడంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 108 వాహనాలు కీలకపాత్ర పోషించాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అరబిందో యాజమాన్యం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 20 అంబులెన్స్‌లను ఒడిశా పంపించింది. ప్రమాదం జరిగిన చోట నుంచి పలువురు క్షతగాత్రులను ఆస్పత్రులకు చేర్చడంలో 108 సిబ్బంది విశేష సేవలందించారు. సంఘటన స్థలం నుంచి క్షతగాత్రులు కె.రాజు, అరుణ, బి.మన్మధరావు, బి.భారతి, కె.పూజ తదితరులను 108 వాహనాల్లోనే విశాఖ తీసుకొచ్చి.. కేజీహెచ్, అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. 108 కో–ఆర్డినేటర్లు ఎం.సురేష్, నజీర్ హుస్సేన్ పర్యవేక్షించారు.

చెన్నైకి 9 మంది రైలు ప్రమాద బాధితులు


మాట్లాడుతున్న శ్రావణి ముఖర్జీ, గౌతమ్ ముఖర్జీ


అటల్ బిహారీ కుటుంబ సభ్యులు

తాటిచెట్లపాలెం : ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో బాధితులను తీసుకుని భద్రక్‌లో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరిన ప్రత్యేక రైలు రాత్రి 11:30 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంది. ఇక్కడి నుంచి అర్ధరాత్రి 12 గంటలకు చెన్నై బయలుదేరింది. ఈ రైలులో ప్రమాద బాధితులు 9 మంది చెన్నై వెళ్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారిలో శ్రావణి ముఖర్జీ, కల్నల్ గౌతమ్ ముఖర్జీ దంపతులు, అటల్ బిహారీ, సోహైల్ రాణా, సుల్తానా సాక్షితో మాట్లాడారు. రైలు ప్రమాదానికి గురవడంతో ఏం జరిగిందో అర్థం కాలేదని.. పది నిమిషాల తర్వాత తేరుకుని చూసేసరికి బోగీలో సామగ్రి చిందరవందరగా ఉన్నాయన్నారు. ఎటు చూసినా ఆక్రందనలే వినిపించాయని, స్థానికులు కొందరు వచ్చి సాయం చేశారని తెలిపారు. తమ తోటి ప్రయాణికురాలు ఒకరు చనిపోయారని, అదృష్టవశాత్తూ తాము ప్రాణాలతో బయటపడ్డామని పేర్కొన్నారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే పోలీసులు

నేర ప్రవృత్తి వీడాల్సిందే

- రౌడీషీటర్లకు ఏసీపీ త్రినాథరావు హెచ్చరిక
- సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచన

ఎంవీపీకాలనీ : నేర ప్రవృత్తిని వీడి, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండాలని రౌడీషీటర్లను టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు హెచ్చరించారు. ప్రతి వారం కౌన్సెలింగ్ ఇస్తున్నా కొందరు నేరాలకు పాల్పడటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కంచరపాలెం, పెందుర్తి, గాజువాక, న్యూపోర్ట్, మల్కాపురం, దువ్వాడ, వన్‌టౌన్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరంలో చోటుచేసుకునే నేరాల్లో రౌడీషీటర్ల పాత్ర ఉందని తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగితే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్‌కు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని, ఎవరైనా తప్పనిసరి గైర్హాజరు కావాల్సి వస్తే ఆయా స్టేషన్లకు సమాచారం అందించాలన్నారు. ఇతరులతో ఎలాంటి సమస్యలున్నా ముందస్తుగా తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. మంచి నడవడిక ఉన్నవారి రౌడీ షీట్లు క్లోజ్ చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, రీషెడ్యూల్


రైళ్లు రద్దు కావడంతో ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫాం

తాటిచెట్లపాలెం: కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద దృష్ట్యా ఆయా స్టేషన్లలో బయల్దేరాల్సిన పలు రైళ్లు ఆదివారం కూడా రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆదివారం బయల్దేరాల్సిన హౌరా–బెంగళూరు(12245) దురంతో ఎక్స్‌ప్రెస్, హౌరా–హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–తిరుపతి (22855) ఎక్స్‌ప్రెస్, షాలిమార్- చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–హౌరా(18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ –షాలిమార్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి –సంత్రగచ్చి (22856) ఎక్స్‌ప్రెస్, విల్లుపురం- పురూలియా (22605) మెయిల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

- హౌరా–తిరుచ్చిరాపల్లి (12663) ఎక్స్‌ప్రెస్ వయా జార్సుగూడ, సంబల్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా నడుస్తోంది.
- అగర్తలా–బెంగళూరు (12504) ఎక్స్‌ప్రెస్ వయా జార్సుగూడ, సంబల్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా నడుస్తోంది.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు

- బెంగళూరులో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు–జసిద్ది (22305) ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా బయల్దేరింది.
- బెంగళూరులో ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరాల్సిన బెంగళూరు- హౌరా(12864) 2.25 గంటల ఆలస్యంగా బయల్దేరింది.
- బెంగళూరులో ఆదివారం ఉదయం 11.30 గంటలకు బయల్దేరాల్సిన బెంగళూరు–హౌరా(12246) ఎక్స్‌ప్రెస్ 2.10 గంటల ఆలస్యంగా బయల్దేరింది.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

స్వాత్మానందేంద్ర సరస్వతి సన్యాసం స్వీకరించి నాలుగేళ్లు


పండితులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న పీఠం ప్రతినిధులు

సింహాచలం: శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి సన్యాసం స్వీకరించి నాలుగేళ్లు పూర్తి కావడంతో ఆదివారం పీఠంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జగద్గురు శంకరాచార్య వేద పాఠశాల విద్యార్థులకు సంప్రదాయ వస్త్రాలు అందజేశారు. స్మార్త, వేద పండితులను ఘనంగా సత్కరించారు. పీఠం సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అన్న సమారాధాన చేపట్టారు. కాగా.. వేద విద్యను అభ్యసించేందుకు 6వ ఏటనే స్వాత్మానందేంద్ర సరస్వతి శారదాపీఠంలో చేరారు. వేదాలను ఔపోసన పట్టారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి ప్రధాన శిష్యుడిగా మెలుగుతూ బాలస్వామిగా గుర్తింపు పొందారు. 2019లో జ్యేష్ఠ పౌర్ణమి రోజున సన్యాసం స్వీకరించారు. అదే రోజు ఆయనకు స్వాత్మానందేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. పట్టాను అందజేయడంతో పాటు పీఠం ఉత్తరాధికారి బాధ్యతలను కూడా స్వరూపానందేంద్ర సరస్వతి అప్పగించారు.

నేటి నుంచి ఉధృతి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

మహారాణిపేట: జిల్లాలో సోమవారం నుంచి 17వ తేదీ వరకు ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వేసవి నుంచి వర్షాకాలం వచ్చే సమయంలో అతిసారం బారిన పడే ప్రమాదం ఉన్నందున.. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయసు పిల్లలున్న ప్రతి ఇంటికీ ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వెళ్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్, జింకు మాత్రలు సరఫరా చేస్తారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రం, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ మాత్రలు సిద్ధం చేశామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని తెలిపారు.